


# క్రౌంచ వియోగం

## డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తి

**శేషయ్య తాత బొద్దుగా వుంటాడు. భారీవిగ్రహం అమ్మమ్మ బుజ్జమ్మ, అసలు పేరు చాలామందికి తెలీదు. బుజ్జమ్మ అమ్మమ్మ అనడం కష్టంకావడంతో పిల్లలందరూ బుజ్జమ్మగానే పిలిచేవారు. ఆనందంగా మారు పలికేది. పిల్లలు అలా పిలవడానికి పెద్దలు అభ్యంతరపెడితే వారిని వారించేది.**

బుజ్జమ్మ బాహ్యనేత్రాలకు చూపులేదు. అయినా కళ్ళు అదోమాదిరి అందంగా వుంటాయి. ఆమె చిన్నప్పుడు కళ్ళకలక వస్తే స్వర్ణక్షీరి (పిచ్చికుసుమలు) పాలు వేస్తే తగ్గుతాయని రోజూ రెండు చుక్కలు వేసేవారు. పొరపాటున ఒకరోజు స్వర్ణక్షీరి అనుకొని అర్కక్షీరము (జిల్లేడు పాలు) వేస్తే కంటిచూపు పోయింది. బుజ్జమ్మ తండ్రి లక్ష్మీనారాయణ తెనాలిలో వెంపటి సూర్యనారాయణగార్కి, మోడి డాక్టరు నేత్రశిబిరంలో చూపిస్తే ఫలితం లేకపోయింది. అప్పటినుంచి మనోనేత్రం వికసించింది. వంటినిండా నేత్రాలు. అమోఘమయిన తెలివితేటలు, శబ్దాన్ని గమనించి ఎవరు వచ్చేది వెళ్ళేది చెప్పేది. ఎవరేమిచేస్తున్నది చూస్తున్నట్లుగా చెప్పేది. సవ్యంగా ఉండకపోతే వూరుకునేది కాదు. కసురుకొనేది.

కథ

శేషయ్యతాత, బుజ్జమ్మ మేనమామ మేనత్త బిడ్డలు. చూపు లేక పోయినందున తండ్రి లక్ష్మీనారాయణ ఆమెకోసం ఆస్తి ఏర్పాటు చేశాడు. చదువు పెద్దగా అబ్బని శేషయ్యతాత ఆస్తి దక్కుతుందిగదా యని బుజ్జమ్మను పెండ్లి చేసుకున్నాడు. రోజులో ఒక్కసారన్నా వాగ్వా దం ఉండేది. 'జాలికొద్దీ చేసుకున్నావని', 'ప్రేమించే చేసుకున్నానని', ఎత్తిపొడుపు మాటలతో వ్యంగోక్తులతో వాగ్వాదం వుండేది.

ఉదయం అంతా హడావుడి వుంటుంది. పిల్లలను ఒడిలో కూర్చో బెట్టుకొని తలకు నూనె రాయడం తన చూపుడువేలుతో చూసు కుంటూ తల పాపిట చక్కగా తీసేది. ఆడపిల్లలకు జడలు వేయడం వారి స్నానాలు అన్నీ బుజ్జమ్మ స్వయంగా చేసుకొనేది. పిల్లల వొళ్ళు తడిమి వారి అనారోగ్య లక్షణా లను పసికట్టేది. శేషయ్యతాత ఏవో పసర్లు, గుళికలు ఇచ్చేవాడు. వారానికి ఒకమారు విధిగా పిల్లలందరికి విరేచన కార్యక్రమం ఉండేది. ఆముదం, అల్లం రసం తాగించేది. వారానికి ఒక్కసారి తలంటి స్నానం, ఇవి శలవలకు అందరికి ఆరోగ్య కార్యక్రమాలు.

పెద్ద కంచు కంచంలో చిక్కటి మజ్జిగతో గుజ్జుగా అన్నం కలిపి ఊరగాయ కొసరింపుతో ముద్దలు ముద్దలుగా పిల్లలందరిని కంచం చుట్టూ కూర్చోబెట్టుకొని అమ్మముద్ద నాన్నముద్దలుగా తినిపించేది. జల్లెడ బుట్టలో జామపండ్లు పెట్టుకొని పేరు పేరునా పిలిచి వొళ్ళో కూర్చోబెట్టుకుని మంచివిగా ఎంచి తినిపించేది.

"అమ్మమ్మ ఇంతమంచి పళ్ళు ఇస్తావ్? నీకెట్లా కనపడతాయి?" ప్రశ్నిస్తే

"నాకు వేళ్ళకు కళ్ళున్నాయి. వేళ్ళు తాకితే కళ్ళు విచ్చుకుంటాయి" అని నవ్వేది.

చెప్పింది అర్థంకాక అమ్మను అడిగితే, ఆమె కళ్ళనిండా నీళ్ళే సమాధానం.

నారాయణ తీర్థులు కృష్ణలీలా తరంగిణి ఇద్దరికీ ప్రీతిపాత్రం 'కృష్ణం కలయ సఖీ సుందరం, బాలకృష్ణం కలయసఖీ' అని శేషయ్య తాత గానం చేస్తుంటే బుజ్జమ్మ ముఖం విప్పారేది. కమ్మటి గొంతు శేషయ్యతాతది. ఆమె మనోనేత్రాలతో బృందావనంలో రాసక్రీడల దృశ్యాన్ని చూస్తున్నట్లుగా కృష్ణలీలలు, గోపికాస్మృతులు వర్ణిస్తూ రసప్లావిత అనుభవాల్ని, తాదాత్మ్య స్థితిలో ఆవిష్కరించు కునేవారు. ఆ సుందర దృశ్యాన్ని ఇంట్లోని వారు కిటికీల దగ్గరో గుమ్మాల దగ్గరో నక్కినక్కి చూస్తూ ఆనందించేవారు. వారి ఏకాంతాన్ని భంగపరిచేవారు కాదు.

** ** **

"యాత్రలు లేవు, పాత్రలు లేవు. మాయచేసి పాటలు పాడి ఈ మంత్రనగరిలో వుంచేశావు, బురిడీ కొట్టిస్తావు మాయలోడివి, నదులూ లేవు పుణ్యస్నానాలు లేవు ఈ గదిలోనే ఈ తోటలోనే అర్థం పరమార్థం, ఒక తీర్థమూ లేదు, ఒక శార్థమూ లేదు".

"అమ్మీ నువ్వు జ్ఞానివే, ఇక్కడినుంచే బృందావనంలో సంచరిస్తావు, కిష్టయ్య నీ ఎదుట నిల్చోడటే!!"

"ఓ నెమలిఫించం పెట్టుకో, నిన్నే కిష్టయ్య అనుకుంటా, చిరుబొజ్జా నువ్వూను"

"ఆ ఎగతాళికే వొళ్ళు మండేది, నిన్ను చేసుకొనే దరిద్రం చుట్టుకుంది".

"బలాదూర్‌గా దేశం మీద తిరిగి ఆస్తి కార్చేసుకుని దరిద్రాన్ని తెచ్చుకున్నావ్! పండంటి బిడ్డల్ని ఇచ్చానయ్యా, బంగారు గనులయ్యా బిడ్డలు నీ దరిద్రం తీరిపోయింది"

"సరేలే సంబడం"

భుజం మీద టవల్ దులిపి కసిగా విదిలించి వడివడిగా నడిచేవాడు శేషయ్యతాత.

ఆయనకు వైద్యమంటే మహాపిచ్చి, ఆకులు అలములు అనుకుంటూ శ్రీశైలం అడవుల్లో చెంచుల మధ్య కొన్నాళ్ళు తిరిగొచ్చాడు. ఎట్లాగయినా గోసాయి చిట్కాతో బుజ్జమ్మ కళ్ళకు తిరిగి చూపు తెప్పించాలని ప్రయత్నాలు చేస్తుంటాడు. గోపాల్ అండ్ కో వారి

**జీవితమంతా చిట్టెడు విషాదం, చిటికెడు సంతోషంతో సాగిపోతున్నది. శేషయ్యతాతకు వంటకాలమీద శ్రద్ధ మెండు. వంటగదిలో అటూ ఇటూ తిరుగుతూ, కావాల్సినవి అందిస్తూ వుంటాడు. వంట బుజ్జమ్మ చేసేది. అన్నం గంజివార్చకుండా యిగిరేవిధంగా చేసేది. ఉడుకుతున్న శబ్దాన్ని బట్టి, వేగుతున్న వాసనను బట్టి పదార్థాల తయారి అంచనా వేసేది. ఆమె అవసరంమేర ఆయనను అనుమతించేది.**

'పులిప్పాణి వైద్యం' పుస్తకం దగ్గర పెట్టుకొని 'రసక్రియ' అని అది ఇది చేస్తుండేవాడు. ఏదైనా అనుమానం వస్తే బాపట్లవెళ్ళి రైల్వేస్టేషను ఎదురుగా చింతలూరు ఆయుర్వేదం షాపు దక్షిణామూర్తిగారిని అడిగి సందేహ నివృత్తి చేసుకొంటాడు.

శుద్ధి చేసిన గంధకం బిళ్ళల్ని మంచంమీద అరటి ఆకుమీద బిళ్ళలుగా చేసి, ఎండబెట్టి, ఎండను బట్టి మంచాన్ని జరుపుతూ ఆరబెట్టి ఎండించే కార్యక్రమం పిల్లల సహాయంతో చేసేవాడు. ఖల్వం లో ఆకులు నూరించేవాడు. ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళ, మనుమలు, మనుమరాళ్ళతో శలవల్లో సందడే సందడి. అందరివి స్థిమితమైన కుటుంబాలు.

జీవితమంతా చిట్టెడు విషాదం, చిటికెడు సంతోషంతో సాగిపోతున్నది. శేషయ్యతాతకు వంటకాలమీద శ్రద్ధ మెండు. వంటగదిలో అటూ ఇటూ తిరుగుతూ, కావాల్సినవి అందిస్తూ వుంటాడు. వంట బుజ్జమ్మ చేసేది. అన్నం గంజివార్చకుండా యిగిరేవిధంగా చేసేది. ఉడుకుతున్న శబ్దాన్ని బట్టి, వేగుతున్న వాసనను బట్టి పదార్థాల తయారి అంచనా వేసేది. ఆమె అవసరంమేర ఆయనను అనుమతించేది. తనకు ఇష్టమైన పద్యాలు, పాటలు పాడుతూ వుండేవాడు. తరచుగా

"కప్పురభోగి వంటకము, కమ్మని గోధుమపిండివంటయున్
గుప్పెడు పంచదారయును కొత్తగ కాచిన అలనేయి
పెసరపప్పును నల్లనటి పండును నాలుగైదు నంజుడుల్
లప్పలతోడ క్రొం బెరుగు లక్ష్మణ వరుల ఇంట రూకకున్

రాగయుక్తంగా పాడుతూ "ఎంత కమ్మటి భోజనమే బుజ్జమ్మా" అంటూ ఉత్సాహపరుస్తూ పోపుపెట్టె ఆమె దగ్గరలో వుంచి "తిరుగమోత" అందిస్తూ

"పునుగున్ తావి, నవోదనంబు
మిరియంపు బోళ్ళతో, చట్టిచయ్యను నాదారని
కూరల గుంపు", గొంతెత్తి రాగంతో పాడుతు చదివేవాడు.

"చాల్లే సంబడం, ఇంకాపు నవ్వుతారు"

"నా పద్యాల రుచే నీ కూరలకు అబ్బిందే అమ్మి!!" అని సంతోషపడేవాడు.

"మనం కమ్మని భోజనం చేయడం, వైశ్వానరప్రీతి! యజ్ఞంతో సమానం"

యిద్దరూ కూర్చొని భోజనం చేసేవారు.

"నిజంగా నీ పద్యాల రుచే కూరలకు అబ్బిందయ్యా" కళ్ళు ఎగరేస్తూ శేషయ్య తాత సంతోషపడేవాడు. మధ్యాహ్న భోజనం అంతా పద్ధతి ప్రకారం వుంటుంది. ముద్దపప్పు, ఏరోజుకారోజు కాచిన వెన్ననెయ్యి, బండపచ్చడి, నూనె గోంగూర, చింతకాయ, కమ్మపొడి, గొడ్డుకారం, దొనవారుగు తోటలోని తాజాకూరలు, పిడత పెరుగు అవశ్యం తాతకు.

భోజనాలు అయినాక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభలలో వచ్చిన యామిజాల పద్మనాభశాస్త్రి, శ్రీనివాసశిరోమణి ప్రవచనాలు, ఆధ్యాత్మ రామాయణమో, సుందరకాండ పారాయణమో జరిగేది. బుజ్జమ్మ వ్యాఖ్యానం అందరూ ఆసక్తిగా వింటుండే వారు. వ్యాఖ్యానం చాలా సరళంగా వుంటుంది. పిల్లలు చిన్నచిన్న కథలకు ఆకర్షితులయ్యేవారు. లోకానుభవము, చమత్కృతి, రసస్వరూపముతో కూడి వివరణ ఉంటుండేది.

** ** **

ఇంటి చుట్టూ కొబ్బరిచెట్లు, తాటిచెట్లు మధ్యమధ్యలో పున్నాగపూలచెట్లు, చెట్టుచెట్టుకూ మధ్య తీగలు చుట్టి కాశీరత్నాలో, రేడియోపూలో తీగలుగా అల్లేవారు. పూలదడిగా వుండేది ప్రహరి. చెట్లమధ్యలో ఇల్లు ముచ్చటగా ఆకర్షణీయంగా వుండేది.

బావి చేదుడుబావి, బావికి దగ్గరలో బాదంచెట్టు, బాదంకాయలు ఏరుకు రావటం, చెట్టు ఎక్కి ఇస్తళ్ళకు బాదం ఆకులు కోసుకరావడం నల్ల చీమలచే కుట్టకుండా దిగిరావడం తోటరాముడి సాహస కార్యక్రమంగా ఉండేది పిల్లలకు. అందరు పిల్లలు, తల్లులు శలవలకు చేరేవారు. కాశీమజిలీ కథలు, మొగలాయి దర్బారు కుట్రలు, కథలు, శరత్‌బాబు నవలలు, వేయిపడగలు, కుటుంబరావు కథలు చదవడంలో మునిగిపోయేవారు. వాళ్ళ వాళ్ళ ఇళ్లలో పని చేసి చేసి అలిసిపోయి వచ్చారని వారికి బుజ్జమ్మ ఏ పని చెప్పక అన్నీ తనే చేసుకుపోయేది. కాఫీలు తినుబండారాలు వారి మంచాల దగ్గరకే పంపేది. ఆమెకు కనిపించదు అన్న స్పృహ ఎవరికి ఉండేదికాదు.

కరివేపాకు చెట్టు చాకలి బండ దగ్గరిగా వుంటుంది. చెట్టు ఎక్కకుండా కొమ్మ విరగకుండా దోటీలతో కరివేపాకు కాడల్ని కోసుకరావాలి. పిల్లలకు శేషయ్యతాత అలా పందెంపెట్టేవాడు. గెలిస్తే, నువ్వుండలో, శనగవుండలో ఇచ్చేవాడు.

ఇంటిముందు పెద్దపెద్ద చెట్లు అందులో రెండు ఉసిరికచెట్లు, చైత్రమాసంలో ఉసిరిక అందరికి 'చైత్రామలకం' అని మంచి రసాయన ఔషధంగా వైద్యపరంగా పంచేవాడు, చాలా దూరం నుంచి చాలామంది దానికోసమై వచ్చి తీసుకువెళ్ళేవారు.

వారానికోసారి ఆముదంనూనె సీసా తీసుకొని చేతిలో నూనె వొంపుకొని తలకు రాయటానికి పిలిచేది.

"రావయ్యా, బోడితలకు తైలాభిషేకం చేస్తా"

"ఇది శివస్వరూపమే!" బట్టతలను చూపిస్తూ నవ్వేవాడు.

"వుండయితే! నూనె రాయను, కొబ్బరికాయ కొడతా!" అనేది.



**అవ్యక్త ఆనందం ఆ యింటిచుట్టూ, యిద్దరూ మమేకమై ప్రతి సందర్భాన్ని సాన్నిహిత్యంగా మలచుకుంటూ రేపటిపట్ల ధ్యాసలేని వర్తమాన జీవితం. నాలుగు కళ్ళు రెండై బతుకు మంట నుంచి కంటతడిలేని జీవితాలుగా ఆహ్లాదంగా కొనసాగాలని మనస్సులు మమేకమై పురాకృత కల్పికలుగా సజీవమూర్తులై 'పాలెం'లో పల్లెటూరిలో ఆ యింట్లో చీకటి పరిమళాలు.**

---

"నిజమేనే! అంతపని చేస్తావు. పతిభక్తి పెచ్చునీకు"

ముసిముసిగా నవ్వుకొనేది.

అటూ ఇటూ తిరుగుతూ తోటంతా కలియబెట్టేవారు అన్ని చెట్లను. మొక్కల్ని పరామర్శించడం నిత్యనైమిత్తికం, చెట్లను ముద్దుగా పలకరిస్తున్నట్లుగా తిరిగేవారు, నేలమీద అల్లుకున్న గుమ్మడిపాద అంటే భయం ఆమెకు, కాళ్ళకు తీగలు చుట్టుకుంటాయని ఆయన అక్కడకు వెళ్ళనిచ్చేవాడు కాదు. గుమ్మడి పులుసు శేషయ్యతాత ఫేవరెట్. బూడిదగుమ్మడి వడియాలుపెట్టి అందరికి పంచేది. వరికోత కాగానే రెండో పంటగా మినుములు పుష్కలంగా పండేవి.

అవ్యక్త ఆనందం ఆ యింటిచుట్టూ, యిద్దరూ మమేకమై ప్రతి సందర్భాన్ని సాన్నిహిత్యంగా మలచుకుంటూ రేపటి పట్ల ధ్యాసలేని వర్తమాన జీవితం. నాలుగు కళ్ళు రెండై బతుకు పంట నుంచి కంటతడిలేని జీవితాలుగా ఆహ్లాదంగా కొనసాగాలని మనస్సులు మమేకమై పురాకృత కల్పికలుగా సజీవమూర్తులై 'పాలెం'లో పల్లెటూరిలో ఆ యింట్లో చీకటి పరిమళాలు.

హైదర్‌పేట, పినిబోయినవారిపాలెం, కప్పలవారి పాలెం అడవిగ్రామం గుండా సముద్రంలోకి వెళ్ళే మురుగుకాల్వ తవ్వకం కాంట్రాక్టు నాగరాజుగారికి లభించింది. పెద్ద మొత్తం లావాదేవీలు, కూలీల బట్వాడాల్లో నమ్మకంగా వుండే వ్యక్తి అని టీచరు ఉద్యోగాన్ని మాన్పించి తన వెంట మిత్రుడు శేషయ్యను తెచ్చుకొన్నాడు నాగరాజు. పనివారికి వారం వారం బట్వాడా చిల్లరనాణేలు, నోట్లు సంచులలో బాపట్ల నుంచి తెచ్చుకొనేవారు. ఒకరోజు రాత్రి పొద్దుపోయేవరకు బట్వాడా పూర్తికాలేదు హడావుడిలో వేయి రూపాయల సంచి మరిచిపోయారు. అక్కడే పక్కనే పనివారు వారి పాకలు, పాలెం మనుషులు తిరుగుతున్నా మరచిపోయిన సంచి అక్కడే ఉండిపోయింది మరునాడు వారు వచ్చేవరకు. అబ్బురపరచిన ఈ సంఘటనతో అక్కడివారి నిజాయితీకి ఆశ్చర్యపోయాడు శేషయ్య.

తన కుటుంబాన్ని వలసగా ఇక్కడికి తెచ్చుకున్నాడు. తనచుట్టూ కొన్ని ఇళ్ళు వెలిశాయి. 'వెంకటరంగాపురం'గా మొదలయింది అక్కడి ప్రస్థానం.

యుక్తవయసులో కులాసా జీవితాన్ని గడిపిన శేషయ్య తాత, వయసు మారేప్పటికి పద్ధతులు మారాయి. టీచరు ఉద్యోగం, తడిపొడి సంపాదన, ఆస్తి కరిగిపోయింది.

గుండ్లకమ్మకు అవతల ఘడియపూడి మెట్టపొలం సేద్యాలు వారిని పడమటివారుగా సంబోధించేవారు. జొన్నలు, సజ్జలు, వరిగలు వర్షాధార మెట్టపొలం సేద్యాలు. ఎప్పుడూ జొన్న అన్నం, సజ్జ సంకటి, గొడ్డుకారం. అక్కడ వరి అన్నం అపురూపం. ఎక్కడో చెరువుకింద పొలాల్లో కొంచెం విస్తీర్ణంలో వరి పండేది. స్వామిబువ్వ కింద చూసుకొనేవారు. వలసగ్రామం వెంకటరంగాపురం 'కృష్ణాజలాల పుణ్యమాని మాగాణి భూములు వరిసాగు మామూలు అయింది. ఆయనకు వరి అన్నం నచ్చేదికాదు. జొన్న అన్నం తిన్ననోటికి వరిఅన్నం పిప్పిలా వుంటుంది అనేవారు. జొన్న అన్నం మంచి సంభోగశక్తిని వయస్థాపనాన్ని కలిగిస్తుంది అని ఆయన భావన.

జీవన సమస్యలను అధిగమించిన కాలాతీత వ్యక్తులుగా కనిపించేవారు. జీవనశైలి వైయక్తికం, వ్యక్తిగత సభ్యత, కుటుంబ సంప్రదాయం పట్ల ప్రాధాన్యతలుండేవి.

ఇంటికి చెట్లే ప్రహరీలు. కొబ్బరిచెట్లు మధ్యలో తాటిచెట్లు. తాటిముంజలకు పిల్లలు ఎగబడేవారు.

ఆ యింటి ముఖ్య ఆకర్షణ సన్నజాజి పందిరి. సాయంత్రం వేళ పక్కయిళ్ళ స్త్రీలు అందరూ చేరేవారు. పూలు కోసేవారు కొందరయితే, మాలకట్టేవారు కొందరు బుజ్జమ్మ దగ్గర కూర్చొని సొంత కష్టసుఖాల్ని వెళ్ళబోసుకునేవారు. మంచిరోజు నిర్ణయం, మంచిమాట కోసం ఓదార్పు కేంద్రంగా సన్నజాజి పందిరి ఉండేది. పొన్నాగ పారిజాతం, మందారాలు పూజకోసం పూలు, సన్నజాజిపందిరి చుట్టూ ప్రాకృతిక పరిమళం.

కాలాతీతమైనప్పుడు ఆయన వచ్చినట్లు గుర్తుగా సన్నజాజిపందిరి గడగడలాడించేవాడు. ఒక్కొక్కరు వెళ్ళొస్తామంటూ వెళ్ళేవారు.



"పిశాచం నీడలా ఆడంగుల దగ్గర ఏమిటీ అలికిడి" కసురుకొనేది.

"ఇంత టైం అయితే ఎట్లా? తేజస్తిమిరంలాంటి వారం"

"సరేలే సంబడం! ఎవరు తేజస్సు ఎవరు చీకటి?"

"పిచ్చిదానా విడదీయలేమే! అంటిపెట్టుకొనే వుంటాయి"

"మనకు పురిటి వాసనలు ఇంకా పోలేదు"

** ** **

బుజ్జమ్మ అమ్మమ్మ కాలం చేసింది అప్పుడు అమెరికాలో వున్నందున చివరిచూపు అందలేదు.

పడమటి ఆకాశంలో అరుణిమకాంతులు సందె బతుకు చీకటిగా మారే సందర్భం. చీకటిలో వేదనాసముద్రం అవిశ్రాంత ఘోష, హోరు, స్తంభించి ఘనీభవించిన నిశ్చలస్థితి. రెండు తడిసిన కళ్ళు.

సన్నజాజి పందిరి పక్కనే పెద్దబండ, దానిమీద సందె వెలుగులో శేషయ్యతాత, అక్కడి నుంచి లేచి చెట్టు చెట్టునూ తాకి బావురుమంటున్నాడు.

శేషయ్యతాత చెట్ల మధ్య కదుల్తుంటే నీడను భారంగా లాక్కెళ్తున్నట్లుగా...

ఏమని ఓదార్చాలి!!

అసహాయత, ఓదార్పు, ఏడుపుగా మారింది. తాతను పట్టుకొని హోరున ఏడ్చేశాను.

తాత ఓదార్పు నా భుజంమీద ఆయన చేయి తడుతోంది.